




జల్లికట్టు సంబరం

● ఎ.రంగంపేటలో కోడెద్దుల జోరు ● జనసంద్రమైన మూడు గ్రామాలు





చంద్రగిరి, జనవరి 16 : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం చంద్రగిరి మండలంలోని ఎ.రంగంపేట, పుల్లయ్యగారిపల్లె, అరిగిలవారిపల్లెల్లో జల్లికట్టు వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు.కోడెద్దుల జోరును తిలకించడానికి చుట్టుపక్కల ప్రాంతాలనుంచి జనం తరలిరావడంతో గ్రామాలు జనసంద్రమయ్యాయి.ఉదయం పశువుల యజమానులు గ్రామ దేవతకు పూజలు చేసి కోడెగిత్తలకు, ఆవులకు, దూడలకు కొమ్ములు చెలిగి రంగులు వేశారు. వాటికి కొమ్ములు తొడిగి రంగు కాగితాలు అంటించిన చెక్క పలకలను, నగదును, రాజకీయ నాయకులు, సినీనటుల ఫొటోలతో కూడిన చెక్క పలకలను కొమ్ములకు కట్టి అల్లిలోకి వదిలారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఎ.రంగంపేటలోని యాదవ వీధిలో పశువులను గుంపులు, గుంపులుగా వదిలారు. యువకులు గుంపులుగా అల్లె అవతల నిలబడి జోరుగా వచ్చే కోడెగిత్తలను నిలువరించేందుకు పోటీ పడ్డారు. కోడెగిత్తల కొమ్ములకు రంగు కాగితాలు అంటించిన చెక్కపలకలను సొంతం చేసుకొనేందుకు తీవ్రంగా ప్రయత్నించారు.ఈ క్రమంలో యువకుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.కొంతమంది యువకులకు గాయాలయ్యాయి.ఎ.రంగంపేటలో అధికంగా పశువులకు టీడీపీ నాయకుల ఫొటోలు, జెండాలు కట్టి వదిలారు.పుల్లయ్యగారిపల్లె, అరిగిలవారిపల్లెల్లో కూడా పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు.ఎ.రంగంపేటలో జల్లికట్టుకు వేలాదిమంది జనం తరలిరావడంతో నారావారిపల్లె మీదుగా వెళ్ళే రోడ్డు మార్గం పూర్తిగా స్తంభించిపోయింది. జల్లికట్టు పూర్తయ్యాక ప్రజలు ఒక్కసారిగా జనం బయటకు రావడంతో ఎ.రంగంపేట సర్కిల్లో సుమారు అర్ధగంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు రంగంలోకి దిగి వాహన రాకపోకలను కొనసాగేలా చర్యలు తీసుకున్నారు.తిరుపతి రూరల్ మండలం, పుదిపట్ల సర్పంచ్ బడి సుధా యాదవ్ ఆధ్వర్యంలో వాటర్ బాటిళ్లను పంపిణీ చేయగా పలువురు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని తనయుడు వినీల్, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఎ.రంగంపేట జల్లికట్టు వేడుకల్లో పాల్గొన్నారు.



వైభవంగా కైలాసగిరి ప్రదక్షిణ

● వివాహ వేడుకకు దేవగణాలను ఆహ్వానించిన పార్వతీ పరమేశ్వరులు



గిరి ప్రదక్షిణలో ఊరేగుతున్న స్వామి అమ్మవారు

శ్రీకాళహస్తి జనవరి 16: శ్రీకాళహస్తిలో కైలాసగిరి ప్రదక్షిణ సంబరం అంబరాన్ని తాకింది. తమ కళ్యాణ మహోత్సవానికి దేవగణాలను శివపార్వతులు ఆహ్వానించే వేడుకకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో శివపార్వతుల కల్యాణ వేడుక వైభవంగా జరుగుతుంది.ఈ వేడుకకు రావాలంటూ పరమశివుడు సతీసమేతుడై కనుమ పండుగ రోజున దేవగణాలకు ఆహ్వానం పలుకుతారు.ఇందులో భాగంగా మంగళవారం స్వామి అమ్మవార్లు గిరిప్రదక్షిణగా వెళ్లి దేవగణాలకు ఆహ్వానం అందజేశారు.సోమవారం త్రిశూలం,పల్లకి గిరి ప్రదక్షిణ జరిగింది.మంగళవారం అర్చకులు అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు.భక్తుల శివనామ స్మరణ మధ్య స్వామి అమ్మవార్ల గిరిప్రదక్షిణ ఉదయం 7.30గంటలకు ఆలయం నుంచి మొదలైంది.వివిధ వాయిద్యాలు,కోలాట నృత్యాల నడుమ పార్వతీ పరమేశ్వరులతో పాటు వేలాది మంది భక్తులు వెంట నడిచారు.విడిది మండపాల వద్ద స్వామి అమ్మవార్లను కొలువుదీర్చగా స్థానిక ఉభయ దారులు నైవేద్యాలు సమర్పించారు.దాతలు పెద్దసంఖ్యలో మంచినీళ్లు,మజ్జిగ, శీతల పానీయాలు, అన్నప్రసాదాలు అందించారు. కైలాసగిరి రిజర్వాయర్ ఎదురుగా అంజూరు వారి మండపం వద్ద ముక్కంటి ఆలయం తరఫున భక్తులకు అన్నదానం చేశారు. చైర్మన్ శ్రీనివాసులు, ఈవో రామారావు భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. గిరి ప్రదక్షిణకు హాజరు కానివారు పట్టణ శివారులోని శుకబ్రహ్మాశ్రమం వద్దకు సాయంత్రం వేలాదిగా తరలివచ్చారు. స్వామి అమ్మవార్లు తిరిగి వచ్చేలోపు స్వర్ణముఖి నదిలో పిల్లలు పెద్దలు ఆటపాటలతో కేరింతలు కొట్టారు.కోనేటి మిట్ట ప్రాంతంలోని ఎదురు సేవ మండపం వద్దకు స్వామి అమ్మవార్లు రాగా ప్రత్యేక పూజలు చేసి నైవేద్య హారతులను సమర్పించారు. ఈ ఎదురు సేవలో ఎంపీ గురుమూర్తి , ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.ఇక్కడి నుంచి ముక్కంటి ఆలయం వరకూ స్వామి అమ్మవార్లు ఊరేగి గిరి ప్రదక్షిణకు స్వస్తి పలికారు.రాత్రి స్వామి అమ్మవార్లు అశ్వసింహ వాహనంపై పురవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

కన్నులపండువగా పార్వేట ఉత్సవం

తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో పార్వేటఉత్సవం కన్నులపండువగా జరిగింది.మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు మలయప్పస్వామి తిరుచ్చిలో పార్వేటమండపానికి వేంచేశారు. స్వామి వెంట మరో తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామి కొలువుదీరారు.ఉభయదారులకు, తాళ్లపాక వంశీయులకు, మఠంవారికి మర్యాదలు చేశాక శ్రీకృష్ణస్వామిని సన్నిధి యాదవ పూజ చేసిన ప్రదేశానికి వేంచేపు చేసి పాలు, వెన్న, హారతులు సమర్పించారు.మలయప్పస్వామి సహా అర్చకులు ముందుకు కొంతదూరం పరుగెత్తి బడిసెను విసిరి వెనక్కు వచ్చారు. ఇలా మూడుసార్లు జరిగింది. మలయప్పస్వామి తిరిగి ఆలయ మహద్వారం వద్దకు చేరుకుని హథీరాంజీ మఠం వారి బెత్తాన్ని తీసుకుని సన్నిధిలోకి వేంచేశారు.టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



నారావారిపల్లెలో సంక్రాంతి వేడుకలు



తల్లిదండ్రుల సమాధుల వద్ద చంద్రబాబు పూజలు



కొబ్బరికాయ కొడుతున్న లోకేశ్

చంద్రగిరి, జనవరి 16: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తన స్వగ్రామమైన నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.కుటుంబ సభ్యులతో,బంధువులతో కలిసి రెండు రోజులపాటు నారావారిపల్లెలో వున్న ఆయన సోమవారం ఉదయం 10.30 గంటలకు తెలుగు సంప్రదాయం ఉట్టి పడేలా పంచెకట్టు ధరించి సోదరి హైమావతి, సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, మనవడు దేవాన్ష్, బావమరిది నందమూరి రామకృష్ణ, వదిన లోకేశ్వరి, మరదలు నారా ఇందిర, ఆమె కుమారుడు సినీహీరో నారా రోహిత్, నందమూరి బాలకృష్ణ భార్య వసుంధర, చిన్న



నాగాలమ్మకు భువనేశ్వరి,ఇందిర పూజలు



కుమార్తె తేజస్విని, ఆమె భర్త భరత్, కుమారుడు ఆర్యవీర్, కంఠమనేని శ్రీనివాస్, శ్రీమాన్ తదితరులతో కలిసి ఇంటి సమీపంలో వున్న గ్రామ దేవత దొడ్డి గంగమ్మ వద్దకు చేరుకుని పూజలు నిర్వహించారు. అనంతరం పొలాల వద్దవున్న కులదేవత నాగాలమ్మకు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11.30 గంటలకు చంద్రబాబు తన తల్లిదండ్రుల సమాధుల వద్దకు చేరుకుని నారా ఖర్జూర నాయుడు, అమ్మణ్ణమ్మలకు నివాళులర్పించారు.ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని, పూలమాలలు వేసి నివాళులర్పించారు.చూడ్డానికి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమస్యలు వింటూ వారితో ఫొటోలు దిగారు.మాజీ మంత్రి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, దొమ్మలపాటి రమేష్, షాజహాన్‌బాషా, టీడీపీ నేతలు గాలి భానుప్రకాష్, కొల్లారి ఇందుశేఖర్, థామస్, నరసింహ యాదవ్, శ్రీనాథరెడ్డి, అనీషారెడ్డి, జెడ్డా రాజశేఖర్, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు,రామ్‌దాస్‌చౌదరి తదితరులు చంద్రబాబుతో,లోకేశ్‌తో మాట్లాడారు.

ఆకట్టుకున్న ఎన్టీఆర్ వేషధారణ

బాపట్ల జిల్లా పరుచూరు నియోజకవర్గ టీడీపీ నేత నాగేశ్వరరావు అలియాస్ అచారి ఎన్టీఆర్ వేషధారణలో నారావారిపల్లెలో సందడి చేశారు.దానవీరశూరకర్ణ సినిమా డైలాగులు చెప్పి అందర్నీ ఆకట్టుకున్నారు.సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నారావారిపల్లె నుంచి చంద్రబాబు తిరుగుప్రయాణమయ్యారు. రోడ్డు మార్గంలో విమానాశ్రయానికి వెళ్తూ చంద్రగిరి పార్టీ ఇన్‌చార్జి టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని ఇంటికి వెళ్ళారు.దొంగ ఓట్లను తొలగించకపోవడంపై నిరసనగా చేపట్టిన నిరాహారదీక్షను పోలీసులు భగ్నం చేస్తే మనస్తాపం చెంది పెట్రోల్ పోసుకుని అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న నానీని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అక్కడి నుంచి రేణిగుంట సమీపంలోని విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాదుకు వెళ్ళారు. సోమవారం మధ్యాహ్నం 3.45 గంటలకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఎ.రంగంపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో విజయవాడకు వెళ్ళారు.

నాని ధర్మపోరాటాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలి



చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లపై పులివర్తి నాని ఆరు నెలలుగా ధర్మపోరాటం చేస్తున్నారు. ప్రజలు కూడా ఆయన పోరాటాన్ని గుర్తుపెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు.నానీని ఆయన నివాసంలో పరామర్శించాక మీడియాతో మాట్లాడుతూ 'చంద్రగిరి నియోజకవర్గంలో 6 మండలాలున్నాయి. పక్కనే తిరుపతి, శ్రీకాళహస్తి, జీడీ నెల్లూరు, పుంగనూరు, పూతలపట్టు, పీలేరు నియోజకవర్గాల్లో ఇక్కడి ఓటర్లను అక్కడికి, అక్కడి ఓటర్లను ఇక్కడికి మార్చేశారు. వైసీపీ వాళ్లు చేసే మోడ్ ఆఫ్ ఆపరేషన్ అంతుచిక్కని విధంగా ఉంది. ఫామ్ 6, 7, 8లను విచ్చలవిడిగా వినియోగించారు. 2019లో 290000 ఓట్లకు 325 బూత్‌లు ఉంటే, ఇప్పుడు 308000 ఓట్లకు 395 బూత్‌లకు పెంచేశారు.ఎమ్మెల్యే స్వగ్రామం తుమ్మలగుంటలో 4 బూత్‌లను 7 చేశారు. 37వేల ఓట్లు మార్పులు, చేర్పులు వచ్చాయి. ఫామ్ 6 ద్వారా 25వేల కొత్త ఓట్లు చేర్చారు. అందులో 40 నుంచి 80 ఏళ్ల వయస్సు గల 6వేల మంది కొత్త ఓటర్లు వచ్చారు. వారు ఎక్కడనుంచి వచ్చారో తెలియదు.ఒకే ఫొటో (పీఎస్ఈ)కలిగినవి 13800 ఓట్లున్నాయి. సంగీత హరి పేరుతో తిరుపతిలో ఒకటి, హరి సంగీత పేరుతో చంద్రగిరిలో మరొక ఓటును చేర్చారు. దువ్వాల క్రాంతి, మల్లంగుంట మహేష్, నందిని బసుమూర్తి, మల్లగుంట్ల బలరాముడు, సతీష్‌కుమార్ అల్లంపాటి, మరిశెట్టి గురవయ్య వంటి పేర్లను శ్రీకాళహస్తి, చంద్రగిరి, తిరుపతి, సత్యవేడు నియోజకవర్గాల్లో ఇంటిపేరును అటూ, ఇటూ మార్చి, ఫొటోలు బ్లర్ చేసి చేర్చారు. దీన్నిబట్టి అధికారులు వైసీపీతో ఏస్థాయిలో కుమ్మక్కయారో తెలుస్తోంది. బూత్‌లు మార్చారు. నియోజకవర్గాలు మార్చారు. వారి ఇష్టానుసారం చేసిపెట్టారు. పేరును నెంబర్లు మార్చేసి మూడు బూత్‌లలో వేశారు. కరుడుకట్టిన నేరస్థులు, ఉగ్రవాదుల కన్నా దారుణంగా ప్రవర్తిస్తున్నారు. అందుకే ఓటరు అవకతవకలపైన చంద్రగిరిని కేస్ స్టడీగా ఎన్నికల సంఘాన్ని తీసుకోమన్నాం' అని చెప్పారు. మాజీ మంత్రులు అమరనాథ రెడ్డి, పరసా రత్నం, టీడీపీ నేతలు నరసింహ యాదవ్, గాలి భానుప్రకాష్ తదితరులు ఆయన వెంట వున్నారు.

ఇందుశేఖర్‌కు చంద్రబాబు ఆహ్వానం



చంద్రగిరి, జనవరి 16: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు తిరుపతి విమానాశ్రయంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు కొల్లూరు ఇందుశేఖర్ సాదర వీడ్కోలు పలికారు. సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు కుటుంబసభ్యులతో కలిసి స్వగ్రామమైన నారావారిపల్లెకు వచ్చిన చంద్రబాబు మంగళవారం సాయంత్రం తిరుగుపయనమయ్యారు. ఈ సందర్భంగా తనను ఒకసారి విజయవాడకు వచ్చి కలవాల్సిందిగా చంద్రబాబు చెప్పారని ఇందుశేఖర్ తెలిపారు.

రూ.10కోట్ల భూమిపై వైసీపీ నేతల కన్ను

- కాలువ పోరంబోకు అని రెవెన్యూ బోర్డు ఉన్నా చదును చేసి ఆక్రమించేశారు





రెవెన్యూ అధికారులు పెట్టిన హెచ్చరిక బోర్డు - ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం

తిరుపతి రూరల్, జనవరి 16: అధికారం అండతో వైసీపీ నాయకులు చెలరేగి పోతున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేసేస్తున్నారు. తాజాగా పది కోట్ల రూపాయల విలువైన కాలువ పోరంబోకునూ దర్జాగా చదును చేసి, ఆక్రమించేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబరు 460, 460/2లో రెండు ఎకరాల 98 సెంట్ల కాలువ పోరంబోకు భూమి ఉంది. రెవెన్యూ అధికారులు కూడా ఆ మేరకు హెచ్చరిక బోర్డు పెట్టి ఉన్నారు. ఈ భూమి విలువ దాదాపు 10 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ భూమిపై స్థానిక వైసీపీ నేతల కన్ను పడింది. ఇంకేముంది హెచ్చరిక బోర్డు ఉన్నా పట్టించుకోకుండా రాత్రికి రాత్రే ఈ భూమిని చదును చేసేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములకే రక్షణ లేకుంటే ఎలా అని, ఇకనైనా ఆక్రమణదారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొనసాగిన కోటి సంతకాల సేకరణ

దీక్షా శిబిరాల్లోనే అంగన్వాడీల పండుగ



పిచ్చాటూరులో మోకాళ్ళపై నిల్చుని నిరసన


తిరుపతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల సమస్యల పరిష్కారం రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చిన కోటి సంతకాల సేకరణ జిల్లాలోని పలు అంగన్వాడీల దీక్షాశిబిరాల్లో సోమ, మంగళవారాల్లోనూ కొనసాగింది. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేస్తున్న పోరాటం 36వ రోజుకు చేరుకుంది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గూడూరు, కోటలో అంగన్వాడీ కార్యకర్తలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. వెంకటగిరి, సూళ్లూరుపేటలో పండుగను కూడా పక్కనపెట్టి దీక్షలు కొనసాగించారు. నాయుడుపేట, పుత్తూరులో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. గొబ్బియాలు తట్టి పాటలు పాడి నిరసన తెలిపారు. మహిళలు పండుగపూట కూడా రోడ్డెక్కి రోదిస్తుంటే జగన్ రెడ్డి నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపై సీఐటీయూ నాయకులు ఈసందర్భంగా మండిపడ్డారు.

కన్నులపండువగా ఎల్లమ్మ రథోత్సవం



అమ్మవారిని రథంపై ఊరేగిస్తున్న దృశం

చంద్రగిరి, జనవరి 16: చంద్రగిరిలో వెలసిన మూలస్థాన ఎల్లమ్మ సంక్రాంతి మహోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని పట్టుపీతాంబరాలు, బంగారు ఆభరణాలతో , వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి రథంపై అధిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం శ్రీదుర్గ అలంకరణలో సింహ వాహనంపై, మహిషాసురమర్ధిని అలంకరణలో భూతవాహనంపై అమ్మవారు భక్తులను అనుగ్రహించారు.ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి, బోర్డు సభ్యులు, ఉభయదారులు పాల్గొన్నారు.



మహిషాసురమర్ధిని అలంకరణలో భూతవాహనంపై ఎల్లమ్మ

అయోధ్య అక్షింతల ఊరేగింపు

భాకరాపేట, జనవరి 16: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకుని అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలను చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో మంగళవారం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇంటింటా వాటిని పంచి పెట్టారు.

తలనీలాల సేకరణకు నేడు వేలం

ఎర్రావారిపాళెం, జనవరి 16: తలకోన సిద్ధేశ్వర స్వామి దేవస్థానంలో తలనీలాల సేకరణకు బుధవారం వేలం వేయనున్నట్లు ఆలయ ఈవో జయకుమార్ మంగళవారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.50వేలు ధరావతు చెల్లించాలన్నారు. అలాగే పాదరక్షలు భద్రపరిచి ఇచ్చేందుకు రూ.5వేలు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలం పాటలు జరుగుతాయని తెలియజేశారు. వివరాలకు 97010 00002, 8639056941 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఓబులశెట్టివారిపల్లెలో పశువుల పండుగ



ఓబులశెట్టివారిపల్లెలో పశువుల ఊరేగింపు

పాకాల, జనవరి 16: మండలంలోని ఓబులశెట్టివారిపల్లెలో మంగళవారం ఘనంగా పశువుల పండుగ నిర్వహించారు. పశువులను శుభ్రం చేసి కొమ్ములకు రంగులు వేసి అందంగా ముస్తాబు చేసి పూజలు చేశారు. కోడె గిత్తల కొమ్ములకు బహుమతులు కట్టి గ్రామంలో ఊరేగించి జల్లికట్టు నిర్వహించారు. కోడెగిత్తలను నిలువరించి కొమ్ములకున్న బహుమతులు దక్కించుకోవడానికి యువత పోటీ పడ్డారు. పశువుల పండుగ తిలకించడానికి తరలివచ్చిన ప్రజలతో ఓబులశెట్టివారిపల్లెలో సందడి నెలకొంది. అలాగే పలు గ్రామాలలో పశువులకు పూజలు నిర్వహించారు. కాటమరాజుకు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.



పశువులను జల్లికట్టుకు తీసుకువస్తున్న యువకులు



చంద్రగిరి మండలం పుల్లయ్యగారిపల్లెలో జల్లికట్టు







ఎ.రంగంపేటలో జల్లికట్టును తిలకిస్తూ గాయపడ్డవారికి చికిత్సలు



జల్లికట్టుకు హాజరైన జనం

బొప్పరాజుపల్లెలో ఉత్సాహంగా జల్లికట్టు

రామచంద్రాపురం, జనవరి 16: సంక్రాంతి సంబరాల్లో భాగంగా అనుపల్లె పంచాయతీ బొప్పరాజుపల్లెలో మంగళవారం జల్లికట్టు కోలాహలంగా జరిగింది. పశువుల మందను జల్లికట్టుకు సిద్ధం చేశారు. దేవతామూర్తులతో పాటు రాజకీయ నాయకులు చిత్రపటాలతో తయారు చేసిన బహుమతులు కోడెగిత్తల కొమ్ములకు కట్టి అల్లి వద్దకు తీసుకువచ్చారు. ఆ సమయంలో డప్పులు కొట్టి బెదిరించడంతో అవి వీధుల్లోకి పరుగులు తీశాయి. ఆ సమయంలో వాటిని నిలువరించి బహుమతులు అందుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. ఈ క్రమంలో పలువురికి స్వల్పగాయాలయ్యాయి. మండలంలో ఇదే చివరి జల్లికట్టు కావడంతో కార్వేటినగరం, వడమాలపేట, వెదురుకుప్పం, చంద్రగిరి మండలాల నుంచి జనం భారీగా తరలివచ్చారు.



వీధుల్లో పరుగులు తీస్తున్న కోడెగిత్త



మాజీ సైనికులను సన్మానించిన లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

మాజీ సైనికులకు సన్మానం

పాకాల, జనవరి 16: జాతీయ సైనిక దినోత్సవం పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మాజీ సైనికులను సన్మానించారు. దామలచెరువులో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్లోబల్ సేవ ప్రజాసంబంధాల సలహాదారు లయన్ సీవీ భానుమూర్తి రెడ్డి 29 మంది మాజీ సైనికులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పి.నాగూర్‌బాషా, యాసానుల్లా, ఆనంద్, రెడ్డిబాషా, కేఎస్.మస్తాన్, జి.రామయ్య, మాజీ సైనికులు నరేంద్ర, జీకే.మస్తాన్, బాబుసాహెబ్, అంజనేయులు, ఖాదర్ బాషా, బషీర్ తదితరులు పాల్గొన్నారు.



అలరించిన నృత్య ప్రదర్శనలు

తిరుచానూరు, జనవరి 16: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో మంగళవారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. శివనాట్య కళానిలయం గురువు సంధ్య పలు అన్నమయ్య కీర్తనలకు కళాకారులు ప్రదర్శించిన నాట్యం ఆహూతులను అలరించింది. యువదర్శిని, మహాలక్ష్మి, తనయ, స్వప్న, భువనేశ్వరి, చంద్రియ, పూజిత, నిఖిత, స్ఫూర్తి, చాందిని, మోక్ష, చార్వి, తేజేష్, లితిష్ తదితరులు నృత్యం చేశారు. కళాకారులను శిల్పారామం ఏవో ఖాదరవల్లి ఘనంగా సన్మానించారు.



వేడుకగా కనుమ మహోత్సవం

తిరుచానూరు, జనవరి 16: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయ ఉద్యానవనంలో మంగళవారం వేడుకగా కనుమ మహోత్సవం జరిగింది. ఉత్సవమూర్తిని ఫ్రైడే గార్డెన్‌కు వేంచేపు చేసి కొలువుదీర్చారు.గజరాజు, వృషభాలు, గోవులకు పూజలుచేసి కర్పూరహారతులు సమర్పించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజు, అర్చకులు బాబు స్వామి, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

తిరుచ్చిపై ఊరేగుతున్న అమ్మవారు



బోయకొండ గంగమ్మ ఆలయానికి 300 స్టీల్ ప్లేట్ల వితరణ

చౌడేపల్లె, జనవరి16: బోయకొండ గంగమ్మ ఆలయానికి 300 స్టీల్ ప్లేట్లు ఓ భక్తుడు విరాళంగా ఇచ్చినట్లు ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తిరుపతికి చెందిన అమ్మవారి భక్తుడు వేణుగోపాల్‌రెడ్డి ఆలయ అవసరాల నిమిత్తం ప్లేట్లు ఇచ్చినట్లు తెలిపారు. ఆయనకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుధాకర్, ఆలయ సిబ్బంది సురేంద్రరెడ్డి, రత్నరెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్లేట్లు అందిస్తున్న దాత వేణుగోపాల్‌రెడ్డి

టీడీపీ ఫ్లెక్సీల తొలగింపు వివాదం

చంద్రగిరి, జనవరి 16: చంద్రగిరిలో సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు ఆ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నాని ఫొటోలతో వేయించిన ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు. ఉదయం నుంచి పట్టణంలో ఈవో మహేశ్వరయ్య, సిబ్బంది ఫ్లెక్సీల తొలగింపునకు విశ్వప్రయత్నం చేశారు. అయితే టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో సాయంత్రం ఎంపీడీవో బాలాజీ నాయక్ టీడీపీ ఫ్లెక్సీలను తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా, తెలుగుయువత మండలాధ్యక్షుడు రాజులగారి వినోద్, నాయకులు సక్కూరి ధనంజయరెడ్డి, సునీల్‌రెడ్డిలు అడ్డుకుని, అధికారులతో వాగ్వాదానికి దిగారు. వైసీపీ ఫ్లెక్సీలు మాత్రం ఎందుకు తొలగించరని నిలదీశారు. ఇప్పటివరకు ఎమ్మెల్యేకు, తుడా ఛైర్మన్‌కు సంబంధించి వైసీపీ నాయకులు కట్టిన ఫ్లెక్సీలను ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. దీనికి అధికారుల వద్ద సమాధానం లేకపోయింది. రాత్రి 8 గంటల సమయంలో మరోసారి పంచాయతీ అధికారులు ఫ్లెక్సీలు తొలగించడానికి వచ్చారు. ఫ్లెక్సీలు తొలగిస్తే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించడంతో తిరిగి వెళ్లిపోయారు. రాత్రి 11 గంటల సమయంలో టీడీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. తర్వాత పోలీసుల సాయంతో ఫ్లెక్సీలు తొలగించారు.



ఎంపీడీవో, ఈవోలతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నాయకులు



ఫ్లెక్సీని తొలగిస్తున్న అధికారులు

ప్రారంభమైన ఏటి పండుగ

నాయుడుపేట టౌన్, జనవరి 16: నాయుడుపేట స్వర్ణముఖి నది పరివాహ ప్రాంతంలో ఏటి పండగను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక మంగళవారం ప్రారంభించారు. సంక్రాంతి పండుగ పర్వదినాల్లో భాగమైన ఏటి పండుగ కనుమ రోజు ప్రారంభమై మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారు. తొలిరోజు బుల్లి తెర సినినటి ఐశ్వర్య, సినీ గాయకులచే గానలహరి జరిగింది.



ఏటి పండుగను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



అంబరాన్నంటుతున్న గాలిపటాలు

పండుగపూట విషాదం

చలపలమ్మ కోనలో ఈతకెళ్లి ఇద్దరు యువకుల మృతి

నగరి, జనవరి 16: పండుగ రోజున విషాదం నెలకొంది. సరదాగా ఈత కోసం చలపలమ్మ కోనకు వెళ్లిన పది మంది యువకుల్లో ఇద్దరు మృతిచెందారు. ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. వివరాలిలా ఉన్నాయి. కనుమ రోజైన మంగళవారం పది మంది స్నేహితులు సరదాగా గడుపుదామని భావించారు. వీరంతా కలిసి నగరి మండలం తడుకుపేట సమీపంలోని చలపలమ్మ కోనకు విహారానికి వెళ్లారు. అక్కడి డ్యామ్‌లో ఈత కొడుతుండగా ఇద్దరు గల్లంతయ్యారు. ఈ విషయాన్ని సహ యువకులు స్థానికులకు తెలియజేయగా, వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. గల్లంతైన వారిలో ఒకరు నగరి పట్టణం కొత్తపేటకు చెందిన కార్తీక్(30), మరొకరు తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి తాలూకా మద్దూరుకు చెందిన ఉమాకాంత్(26) గా పేర్కొన్నారు. ఈ ఇద్దరి కుటుంబీకులూ డ్యామ్ వద్దకు చేరుకున్నారు. నగరి అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని గాలించారు. చివరకు రాత్రి 8గంటలకు ఒక మృతదేహాన్ని, 8.30 గంటలకు మరో మృతదేహాన్ని బయటకు తీశారు. తమ సిబ్బందితో ఎస్‌ఐ కుళ్లాయప్ప సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుల్లో ఉమాకాంత్‌కు రెండేళ్ల క్రితం వివాహమైందని, కార్తీక్‌కు ఇద్దరు పిల్లలున్నట్లు వారి కుటుంబీకులు తెలిపారు.



మృతదేహాలను వెలికి తీస్తున్న ఫైర్‌సిబ్బంది-కార్తీక్,ఉమాకాంత్(ఫైల్‌ఫొటోలు)





తిరుపతి

నేడు మానవహారం

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 16: సామాజిక సమతా సంకల్పంలో భాగంగా బుధవారం ఆర్టీసీ సర్కిల్‌లో మానవహారం, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలల సమర్పణ చేయనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించాక మానవహారం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'హెల్తీ విలేజ్' వర్క్‌షాప్‌కు పక్కాగా ఏర్పాట్లు : జేసీ


అధికారులకు సూచనలిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి (కలెక్టరేట్), జనవరి 16: పద్మావతి మహిళా వర్సిటీలో గురువారం నుంచి శనివారం వరకు జరగనున్న హెల్తీ విలేజ్ (ఆరోగ్యకరమైన గ్రామం) జాతీయ వర్క్‌షాప్‌ను పక్కాగా ఏర్పాట్లు చేయాలని జేసీ శుభం బన్సల్ ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం మహిళా వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో వర్క్‌షాప్ నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై రెండో థీమ్ అయిన హెల్త్ విలేజ్ జాతీయ వర్క్‌షాప్‌కు కేంద్రమంత్రులు, పలు రాష్ట్రాల నుంచి మంత్రులు, రాష్ట్రస్థాయి అధికారులు, ఇతర అధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. అందువల్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం కార్యక్రమ నిర్వహణ ప్రదేశాలను జేసీ పరిశీలించారు. పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ ఆనంద్, డీఆర్వో పెంచల కిషోర్, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీపీవో రాజశేఖర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



తుమ్మల నాగేశ్వరరావు - చాగంటి కోటేశ్వరరావు



నేహా శెట్టి - అనూష

తిరుమల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. తెలంగాణ ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, రాందాస్ నాయక్, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనవేత్త చాగంటి కోటేశ్వరరావు, హీరోయిన్ నేహా శెట్టి, కన్నడ నటి అనూష ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా, దర్శనం అనంతరం చాగంటి కోటేశ్వరరావు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. విడివిడిగా కుటుంబాలకు తల్లిదండ్రులు ఉంటారు కానీ మొత్తం లోకానికే తల్లీతండ్రి శ్రీవేంకటేశ్వరస్వామి అన్నారు. ఆస్వామి క్షేత్రంలో భక్తులు ఎంతో సంతోషంగా చిరునవ్వుతో తిరుగుతుంటే ఇది కదా పెద్ద కుటుంబం అనిపిస్తోందన్నారు. స్వామి పుష్కరిణిలో స్నానం చేసి దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. తమ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రావడంతో శ్రీవారికి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చినట్టు తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు కలిసిమెలసి ఉండాలని, అందరికీ మంచి ఆరోగ్యం ఇవ్వాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు. వైసీపీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో తమ ప్రభుత్వం మళ్లీ ఏర్పాటు కావాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



తిరుపతి (కొర్లగుంట), జనవరి 16: చిల్లీస్ రెస్టారెంట్ అండ్ హోటల్స్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీల విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. సంక్రాంతిని పురస్కరించుకుని చిల్లీస్ అధినేత, జిల్లా హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ ప్రెసిడెంట్ అంజి(ఆంజినేయులు) ఈనెల 10 నుంచి 14తేదీ వరకు తమ నివాసాల ముందు వేసిన ముగ్గులను ఫొటోలు తీసి వాట్సాప్‌కు పంపాలని కోరారు. మొత్తం 150మంది పంపిన ముగ్గుల్లో ఆకట్టుకున్న వాటిని ప్రాధాన్య క్రమంలో విజేతలుగా ఎంపిక చేశారు. ఈ వివరాలను వారికి వాట్సాప్ ద్వారానే తెలియజేశారు. మునికుమారి (ప్రథమ -రూ. 10వేల విలువైన వస్తువులు), నందిని (ద్వితీయ -రూ. 8వేల విలువైన వస్తువులు), శిశిర(తృతీయ రూ.7వేల విలువైన వివిధ వస్తువులు), మరో ఏడుగురికి రూ.1,500 విలువ చేసే వస్తువులు ప్రదానం చేశారు. మిగిలిన 140మందికి క్వాలిటీ చికెన్ బిర్యానీ పంపిణీ చేశారు.

ప్రయాణికుల సౌకర్యమే ప్రధానం


సిబ్బందితో మాట్లాడుతున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి(కొర్లగుంట), జనవరి 16: ప్రయాణికుల సౌకర్యమే ప్రధానమని ఆర్టీసీ కడప జోన్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) చెంగల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం తిరుపతి డిపో గ్యారేజీలో ఆర్టీసీ భద్రతా మాసోత్సవాలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం బాగోలేకుంటే విశ్రాంతి తీసుకోండి.. మరమ్మతులకు గురైన బస్సులను నడపవద్దు.. తదితర సూచనలిచ్చారు. డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, డిపో మేనేజర్ బాలాజి, ఏటీఎమ్స్ రామచంద్రనాయుడు, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు విశ్వంలో నవోదయ ఉచిత నమూనా పరీక్ష

తిరుపతి(విద్య), జనవరి 16: వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్లో గురువారం ఉదయం 10గంటలకు జవహర్ నవోదయ మోడల్‌టెస్ట్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, స్కూల్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. జాతీయస్థాయిలో నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 20న నిర్వహించే ప్రవేశ పరీక్షకు అనుగుణంగా నమూనా పరీక్ష ఉంటుందని తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్ జెరాక్స్ కాపీని వెంట తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

దిగువమాఘంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

తవణంపల్లె, జనవరి 16: తవణంపల్లె మండలంలోని దిగువమాఘంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, రామచంద్ర నాయుడు దంపతుల ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గల్లా కుటుంబ సభ్యులు స్థానిక రాజన్న పార్కు వరకు గ్రామస్తులతో కలిసి ర్యాలీగా వెళ్లారు. అక్కడున్న మాజీ ఎంపీ స్వర్గీయ రాజగోపాల్ నాయుడి విగ్రహానికి పూజలు నిర్వహించి, నివాళులర్పించారు. అలాగే గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గల్లా అరుణ కుమారి మాట్లాడుతూ.. గ్రామస్తులతో కలిసి స్వగ్రామం దిగువమాఘంలో సంక్రాంతి జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. మన సంప్రదాయాలు భావితరాలకు గుర్తుండేలా సంబరాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్, గల్లా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న గల్లా కుటుంబ సభ్యులు

శ్రీవారి హుండీ ఆదాయం

రెండ్రోజుల్లో రూ.7.02 కోట్లు

తిరుమల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామికి హుండీ ద్వారా ఆదాయం రెండ్రోజుల్లో రూ.7.02 కోట్లు లభించింది. ఆదివారం రూ.3.13 కోట్లు, సోమవారం రూ.3.89 కోట్లు లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 80,964 మంది, సోమవారం 86,107 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ రెండ్రోజుల్లో 57,506 మంది స్వామివారికి తలనీలాలు సమర్పించారు.

మా ఉసురు ప్రభుత్వానికి తగులుతుంది!

- జీతాలు పెంచే వరకు సమ్మె ఆగదు: అంగన్వాడీలు

తిరుపతి (రవాణా), జనవరి 16: తమ ఉసురు ప్రభుత్వానికి తప్పకుండా తగులుతుందని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద వీరు చేస్తున్న దీక్ష సోమవారంతో 34వ రోజుకు, మంగళవారంతో 35వ రోజుకు చేరుకుంది. సోమవారం సంక్రాంతి పండగను పురస్కరించుకుని శిబిరం వద్ద ముగ్గులు వేసి కొత్తకుండ తెచ్చి పొంగలి పెట్టి, ఆ దారిలో వెళ్లేవారికీ పంచిపెట్టి తమ నిరసన కొనసాగించారు. మంగళవారం కనుమను పురస్కరించుకుని శిబిరం ముందు కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ నాయకురాలు టి.నాగరాజమ్మ మాట్లాడుతూ.. పండుగల సమయంలో కూడా తాము వీధుల్లోకి వచ్చి ఎండకి ఎండి.. వానకు తడిసి ఇబ్బందులు పడుతున్నా తమ మీద కనికరం చూపక పోవడం వైసీపీ ప్రభుత్వానికి మంచి పద్ధతి కాదన్నారు. తమ వేతనాలు పెంచే వరకు సమ్మె ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కల్పన, గీత, ఎల్లమ్మ, సుజాత, సుజిత, వరలక్ష్మి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.


పొంగళ్లు పెట్టి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

తిరుమల శ్రీవారికి గోదామాలలు

తిరుమల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీవారికి మహా భక్తురాలైన గోదాదేవి పరిణయోత్సవం పురస్కరించుకుని గోదామాలలను శ్రీవారి మూలవిరాట్‌కు మంగళవారం ఉదయం సమర్పించారు. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలోని ఆండాళ్ గోదాదేవి చెంత నుంచి శ్రీవారికి ప్రత్యేక మాలలు కానుకగా అందాయి. మాలలు తిరుపతి నుంచి తిరుమల పెద్దజీయర్‌స్వామి మఠానికి మంగళవారం ఉదయం చేరుకున్నాయి. అనంతరం మఠం నుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయంలో పూజా కార్యక్రమాలయ్యాక మూలవిరాట్టుకు అలంకరించారు. జీయర్ స్వాములు, జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీఈవో లోకనాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.


గోదాదేవి మాలలతో జీయర్‌స్వాములు

వైదికోక్తంగా 'కాకబలి'

శ్రీవారి ఆలయంలో ప్రతి ఏడాది కనుమ పండుగను పురస్కరించుకుని ఉదయాత్పూర్వం నిర్వహించే 'కాకబలి' కార్యక్రమం మంగళవారం వైదికోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా అర్చకస్వాములు.. పసుపు, కుంకుమ వేర్వేరుగా కలిపిన అన్నాన్ని ఆనంద నిలయం విమాన వేంకటేశ్వరస్వామికి నివేదించారు.

శ్రీవారి ఆలయంలో తిరిగి మొదలైన సుప్రభాతం

తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుప్రభాత సేవ తిరిగి మొదలైంది. పవిత్రమైన ధనుర్మాసం ఆదివారంతో ముగియడంతో సోమవారం వేకువజాము నుంచి శ్రీవారి ఆలయంలో సుప్రభాతసేవ పునఃప్రారంభమయ్యింది. గతేడాది డిసెంబరు 17వ తేదీ తెల్లవారుజాము నుంచి ధనుర్మాస ఘడియలు ప్రారంభమైన నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో సుప్రభాత సేవ స్థానంలో గోదా తిరుప్పావై పారాయణం కొనసాగింది. అయితే జనవరి 14వ తేదీతో ధనుర్మాస ఘడియలు పూర్తికావడంతో 15వ తేదీ నుంచి యథాప్రకారం ఆలయంలో సుప్రభాత సేవ నిర్వహించారు.

అలరించిన గోదాకల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

తిరుపతి (కల్చరల్), జనవరి 16: సంక్రాంతి పండగను పురస్కరించుకుని సోమవారం రాత్రి టీటీడీ పరిపాలనా భవనం మైదానంలో టీటీడీ కన్నులపండగగా గోదాకల్యాణం నిర్వహించింది. ముందుగా శ్రీకృష్ణ, ఆండాళ్ అమ్మవారి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి.. అర్చకస్వాములు కల్యాణ వేదిక మీదకు తీసుకొచ్చారు. అనంతరం శ్రీవారి ఆలయ అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, రక్షాబంధనం, అగ్నిప్రతిష్ఠ చేసి, సర్కారు సంకల్పం, భక్తుల సంకల్పం, మధుపర్కం నివేదనం, తదితర కల్యాణ లాంఛనాలను సంప్రదాయ రీతిలో చేపట్టారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు శ్రీరఘునాథ్ బృందం అన్నమయ్య కీర్తనలను ఆలపించింది. ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. జేఈవో వీరబ్రహ్మం దంపతులు, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణీ సదాశివమూర్తి, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ కుమార్, శ్రీవారి ఆలయ డిప్యూటి ఈవో లోకనాథం, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గో సంపదను రక్షించుకుందాం : టీటీడీ ఛైర్మన్ భూమన



టీటీడీ గోశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు - రామచంద్ర పుష్కరిణి వేదిక వద్ద భూమన, తదితరులు

తిరుపతి (కల్చరల్), జనవరి 16: గో సంపదను పరిరక్షించుకుందామని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కనుమ పండగ సందర్భంగా టీటీడీ గోశాలలో గోమహోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భూమన మాట్లాడుతూ.. వేదాలు, పురాణాల్లో చెప్పిన విధంగా గోవులు సకలదేవతా స్వరూపాలన్నారు. దాతలు ఇప్పటి వరకూ ఎస్వీ గో సంరక్షణ ట్రస్టుకు రూ. 250 కోట్లకు పైగా విరాళాలు అందించారని తెలిపారు. అంతకుముందు గోశాలలోని వేణుగోపాల స్వామి ఆలయంలో జరిగిన పూజల్లో భూమన పాల్గొన్నారు. పశువులకు హారతులు పట్టారు. అన్నమాచార్య, దాససాహిత్య ప్రాజెక్టుల కళాకారులు నిర్వహించిన సంగీత, భజన కార్యక్రమాలు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. గోశాల సంచాలకుడు డాక్టర్ హరనాథ్ రెడ్డి, గోసంరక్షణ ట్రస్టు సభ్యులు శ్రీరాం సునీల్ రెడ్డి, శ్రీధర్, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ కుమార్, హిందూధర్మప్రచార పరిషత్ కార్యదర్శి సోమయాజులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తి చైతన్యం కోసమే రామాలయ నిర్మాణం: ప్రజల్లో భక్తి చైతన్యం నింపడానికే అయోధ్యలో రామాలయ నిర్మాణం జరిగిందని టీటీడీ ఛైర్మన్ అన్నారు. టీటీడీ సహకారంతో శ్రీరామచంద్ర పుష్కరిణి వద్ద శ్రీహనుమాన్ దీక్షా పీఠం నిర్వహిస్తున్న కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞంలో మంగళవారం ఆయన పాల్గొని, ప్రసంగించారు. తాను చిన్నతనం నుంచే శ్రీరామ భక్తుడనని చెప్పుకున్నారు. ఇక్కడ ఈ హనుమాన్ చాలీసా జరగడానికే తన చేత రామచంద్ర పుష్కరిణిని ఆధునీకరించే అవకాశం శ్రీనివాసుడు ఇచ్చాడేమోనన్నారు. విశ్వ హిందూపరిషత్ రాష్ట్ర నాయకుడు రాఘవులు, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ, దుర్గాప్రసాద్ స్వామి, సాకం ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు. కాగా, 14వ తేదీ నుంచి జరుగుతున్న హనుమాన్ చాలీసా కార్యక్రమం ఈనెల 21వ తేదీన ఎస్వీ యూనివర్సిటీ తారకరామ స్టేడియంలో జరిగే కార్యక్రమంతో ముగియనుంది.

'శుద్ధ పాఠశాల-సుందర పాఠశాల'లో వేద విద్యార్థులు



పరిశుభ్రత పనుల్లో వేద విద్యార్థులు

తిరుమల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): టీటీడీ విద్యాసంస్థల్లో 'శుద్ధ పాఠశాల-సుందర పాఠశాల' కార్యక్రమానికి టీటీడీ శ్రీకారం చుట్టింది. గతంలో 'శుద్ధ తిరుమల-సుందర తిరుమల' పేరిట తిరుమల, ఘాట్ రోడ్లు, కాలినడకమార్గాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. ఇపుడు టీటీడీ విద్యాసంస్థలను కూడా పరిశుభ్రంగా ఉంచడంలో భాగంగా శుద్ధ పాఠశాల-సుందర పాఠశాలను కూడా ప్రారంభించారు. ప్రతినెలా మొదటి శనివారం రోజున ఈకార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకుంది. తిరుమలలోని ధర్మగిరి వేదశాలలో మాత్రం ప్రతినెలా మొదటి అష్టమి ముందురోజున కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా సోమవారం వేదపాఠశాలలో విద్యార్థులు తమ పాఠశాల, పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు.

తర్పణాల సమర్పణకూ జనానికి తిప్పలు

- రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్



తిరుపతి (రవాణా), జనవరి 16: కపిలతీర్థం వద్ద తర్పణాలు సమర్పణకూ జనానికి తిప్పలు తప్పడంలేదని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తమ పితృదేవతలకు తర్పణాలు వదలడానికి కపిల తీర్థానికి ఏటా సుమారు 10వేలమంది వస్తుంటారని చెప్పారు. అటువంటిది ఈ ప్రదేశంలో అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించక పోవడం సరికాదన్నారు. జనం నడిరోడ్డుపై కూర్చొని పితృదేవతలకు తర్పణాలు సమర్పించడం శోచనీయమన్నారు. వచ్చే సంవత్సరం అయినా టీటీడీ, నగరపాలకసంస్థ, పోలీసు అధికారులు సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏపీకి విభజన హామీలు అమలు

తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్

తిరుమల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర విభజన అనేది అనివార్యం. ఆనాడే ఏపీకి అవసరమైన ప్రత్యేక హోదా, ఇతర అభివృద్ధి అంశాలతో హామీలు ఇచ్చాం. ఆ దిశగానే అప్పటి ప్రధాని కూడా హామీ ఇచ్చారు. కానీ ఆనాడు ఉన్నవాళ్లు ఒప్పుకోలేదు. కేంద్రంలో, ఏపీలో మా పార్టీ అధికారంలోకి వస్తే ఏపీకి రావాల్సిన విభజన హామీలు అమలు చేస్తాం' అని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణాతో పాటు ఏపీ కూడా బాగుండాలనే విధంగా పనిచేస్తామన్నారు. కాంగ్రెస్‌పై ప్రజలకు ఉన్న వ్యతిరేక భావన తొలగిపోయిందన్నారు. విభజనతో పాటు అభివృద్ధి కూడా జరగాల్సి ఉన్నప్పటికీ జరగలేదన్నారు. ఇక, ఏపీలో ఎన్నికల అంశంపై మాట్లాడుతూ.. తాను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తనని, పార్టీ నిర్ణయం మేరకు ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ప్రచారం కోసం తిరిగానన్నారు. తప్పకుండా ఏపీలో కూడా కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వమని ప్రజలను కోరుకుంటామన్నారు.కాంగ్రెస్‌కు కొత్త ఓట్లు వస్తాయా, లేక వైసీపీ, టీడీపీ ఓట్లు వస్తాయా అనేది భవిష్యత్తు నిర్ణయిస్తుందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.


తిరుమల ఆలయం వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్

టీటీడీకి ఆర్గానిక్ నెయ్యి విరాళం

తిరుమల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి రూ.22 లక్షల విలువైన ఆర్గానిక్ నెయ్యి సోమవారం విరాళంగా అందింది. పుణెకిచెందిన పరాగ్ ఫుడ్స్ సంస్థ ఆధ్వర్యంలోని భాగ్యలక్ష్మి డెయిరీ వెయ్యి కేజీల ఆర్గానిక్ నెయ్యిని అందించింది. సంస్థ ఛైర్మన్ దేవేందర్ షా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అక్షాలీషా తరపున పలమనేరులోని భాగ్యలక్ష్మి డెయిరీ వైస్‌ప్రెసిడెంట్ సంజయ్‌నక్రా బృందం ఈ విరాళాన్ని శ్రీవారి ఆలయ డిప్యూటీఈవో లోకనాథం, పడిపోటు సూపరింటెండెంట్ కృష్ణమూర్తికి అందజేసింది.

తమిళ మందుబాబుల సందడి



కనుమ సందర్భంగా తమిళనాడులో మద్యం షాపులు మూసేయడంతో సరిహద్దుల్లోని పాలసముద్రం మండలం బలిజకండ్రిగ మద్యం షాపు మంగళవారం కిటకిటలాడింది. ఉదయం నుంచే రద్దీ పెరగడంతో మద్యం దుకాణాల ఎదుట పోలీసులు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. రోజుకు లక్షా లక్షన్నర రూపాయల అమ్మకాలు జరిగే ఈ షాపులు అయిదారు లక్షల మద్యం హాట్‌కేకుల్లా అమ్ముడైపోయింది. నిజానికి తమిళనాడు కంటే ఇక్కడ మద్యం ధరలు ఎక్కువ. అయినా తమిళనాడు మందుబాబులు ఎగబడ్డారు.

\- పాలసముద్రం

ముక్కంటి అన్నదానానికి

విరాళాలు

శ్రీకాళహస్తి, జనవరి 16: ముక్కంటి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు విరాళాలు సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన నీరజ రూ.లక్ష , కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన వెంకటరెడ్డి రూ.లక్ష , గుంటూరుకు చెందిన గాలి శ్రీనివాసరావు రూ.50 వేలు విరాళంగా సమర్పించారు. ఆలయ అధికారులు దాతలకు విరాళ పత్రం అందజేసి ధన్యవాదాలు తెలిపారు.

ప్రసాదాల వితరణ



తిరుపతి(కొర్లగుంట), జనవరి 16: సంక్రాంతిని పురస్కరించుకుని కపిల తీర్థం వద్ద సోమవారం పితృదేవతలకు తర్పణాలు సమర్పించేవారికి సింగంశెట్టి సుబ్బరామయ్య ఆధ్వర్యంలో చక్కెర, నెయ్యి పొంగలితోపాటు పులిహోర వంటి ప్రసాదాలను వితరణ చేశారు. విక్రమ్‌స్వామి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, పద్మనాభం, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు


విజేత జట్టుకు ట్రోఫీ ప్రదానం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 16: కనుమ సందర్భంగా మంగళవారం ఓటేరులోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో వాలీబాల్ పోటీలు జరిగాయి. వాయుపుత్ర ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఎస్‌జే హీరోస్ మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతగా ఎస్‌జే హీరో జట్టు, రన్నరప్‌గా కిషోర్ జట్టు నిలిచింది. ముఖ్యఅతిథులుగా తిరుపతి ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్, భీమాస్ హోటల్ అధినేత అశోక్, కాసారం హరీష్ హాజరై విజేతలకు ట్రోఫీ, బహుమతులను అందజేశారు.

పండుగపూట విషాదం

చలపలమ్మ కోనలో ఈతకెళ్లి ఇద్దరు యువకుల మృతి

నగరి, జనవరి 16: పండుగ రోజున విషాదం నెలకొంది. సరదాగా ఈత కోసం చలపలమ్మ కోనకు వెళ్లిన పది మంది యువకుల్లో ఇద్దరు మృతిచెందారు. ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. వివరాలిలా ఉన్నాయి. కనుమ రోజైన మంగళవారం పది మంది స్నేహితులు సరదాగా గడుపుదామని భావించారు. వీరంతా కలిసి నగరి మండలం తడుకుపేట సమీపంలోని చలపలమ్మ కోనకు విహారానికి వెళ్లారు. అక్కడి డ్యామ్‌లో ఈత కొడుతుండగా ఇద్దరు గల్లంతయ్యారు. ఈ విషయాన్ని సహ యువకులు స్థానికులకు తెలియజేయగా, వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. గల్లంతైన వారిలో ఒకరు నగరి పట్టణం కొత్తపేటకు చెందిన కార్తీక్(30), మరొకరు తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి తాలూకా మద్దూరుకు చెందిన ఉమాకాంత్(26) గా పేర్కొన్నారు. ఈ ఇద్దరి కుటుంబీకులూ డ్యామ్ వద్దకు చేరుకున్నారు. నగరి అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని గాలించారు. చివరకు రాత్రి 8గంటలకు ఒక మృతదేహాన్ని, 8.30 గంటలకు మరో మృతదేహాన్ని బయటకు తీశారు. తమ సిబ్బందితో ఎస్‌ఐ కుళ్లాయప్ప సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుల్లో ఉమాకాంత్‌కు రెండేళ్ల క్రితం వివాహమైందని, కార్తీక్‌కు ఇద్దరు పిల్లలున్నట్లు వారి కుటుంబీకులు తెలిపారు.






మృతదేహాలను వెలికి తీస్తున్న ఫైర్‌సిబ్బంది-కార్తీక్,ఉమాకాంత్(ఫైల్‌ఫొటోలు)

ఘనంగా మకరజ్యోతి వేడుకలు



నాగేశ్వరస్వామి ఆయలంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సూళ్లూరుపేట, జనవరి 16: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం, పాండురంగ స్వామి ఆలయం, నాగేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం అయ్యప్ప స్వామి మకరజ్యోతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శబరిమలైలో మకరజ్యోతి వెలిగే సమయంలో అయ్యప్ప స్వామి భక్తబృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆలయం ఎదుట కర్పూరంతో జ్యోతిని వెలిగించారు. అశేష భక్తజనం.. అయ్యప్ప భక్తబృందం భజనల నడుమ భక్తులు కర్పూర జ్యోతి చుట్టూ ప్రదర్శనలు చేస్తూ జ్యోతిని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయమంతా జ్యోతులు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. నాగేశ్వరస్వామి ఆలయంలో లక్ష దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, అయ్యప్ప భక్తబృందం నాయకులు చిట్టేటి పెరుమాల్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి

నాయుడుపేట, జనవరి 16: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఈనెల 19న వెంకటగిరిలో నిర్వహిస్తున్న రా.. కదిలిరా.. సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ అన్నారు. నాయుడుపేట శ్రీనివాస్ ఫంక్షన్ హాలులో మంగళవారం సూళ్లూరుపేట నియోజకవర్గ స్థాయి సమావేశం నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ మంత్రి పరసా రత్నం, నియోజకవర్గ పరిశీలికుడు, మాజీ ఎమ్మెల్యే కంభంపాటి విజయరామిరెడ్డి, తిరుపతి, నెల్లూరు జిల్లాల తెలుగు మహిళ అధ్యక్షులు ఉష, పనబాక భూలక్ష్మి, ఏఎంసీ మాజీ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, చెంచల బాబుయాదవ్, టీడీపీ నాయకులు శివకోటం రెడ్డి, డాక్టర్ సందీప్, శ్రీపతి బాబు, ఆకుతోట రమేష్, శ్రీనివాసుల నాయుడు, విజయకుమార్ నాయుడు, సంచి కృష్ణయ్య, పనల గంగాప్రసాద్, సుబ్బారావు, శ్రీరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10కోట్ల భూమిపై వైసీపీ నేతల కన్ను

కాలువ పొరంబోకు అని రెవెన్యూ బోర్డు ఉన్నా చదును చేసి ఆక్రమించేశారు





రెవెన్యూ అధికారులు పెట్టిన హెచ్చరిక బోర్డు - ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం

తిరుపతి రూరల్, జనవరి 16: అధికారం అండతో వైసీపీ నాయకులు చెలరేగి పోతున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేసేస్తున్నారు. తాజాగా పది కోట్ల రూపాయల విలువైన కాలువ పొరంబోకునూ దర్జాగా చదును చేసి, ఆక్రమించేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబరు 460, 460/2లో రెండు ఎకరాల 98 సెంట్ల కాలువ పొరంబోకు భూమి ఉంది. రెవెన్యూ అధికారులు కూడా ఆ మేరకు హెచ్చరిక బోర్డు పెట్టి ఉన్నారు. ఈ భూమి విలువ దాదాపు 10 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ భూమిపై స్థానిక వైసీపీ నేతల కన్ను పడింది. ఇంకేముంది హెచ్చరిక బోర్డు ఉన్నా పట్టించుకోకుండా రాత్రికి రాత్రే ఈ భూమిని చదును చేసేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములకే రక్షణ లేకుంటే ఎలా అని, ఇకనైనా ఆక్రమణదారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కనుల పండువగా సిద్దేశ్వర, భూపతేశ్వరస్వామి ఉత్సవాలు



సిద్దేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెళ్లకూరు, జనవరి 16: మండలంలోని శిరసనంబేడు, రోసనూరు గ్రామాల్లో సంక్రాతి పర్వదినం సందర్భంగా మంగళవారం సిద్దేశ్వర, భూపతేశ్వరస్వామి ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. కార్తీక మాసంలో మహాశివుడికి పూజలు చేసినట్లే ధనుర్మాసంలో వైష్ణవ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. ఈ రెండు గ్రామాల్లో పూర్వీకుల నుంచి సంక్రాతి సందర్భంగా శివుడికి ప్రత్యేక పూజలు, ఉత్సవాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. సిద్దేశ్వర, భూపతేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అలకరించి వైభవంగా కొండ చుట్టూ ఊరేగించారు. రాత్రి గ్రామంలో ఊరేగించారు. మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ వైభవంగా జరిగిన కొండచుట్టూ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొండ కింద నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను కనువిందు చేశాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి తదితరులు సిద్దేశ్వరస్వామిని దర్శించుకున్నారు.




ఏటి పండుగను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య - అంబరాన్నంటుతున్న గాలిపటాలు

ప్రారంభమైన ఏటి పండుగ

నాయుడుపేట టౌన్, జనవరి 16: నాయుడుపేట స్వర్ణముఖి నది పరివాహ ప్రాంతంలో ఏటి పండగను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మున్సిపల్ ఛైర్ పర్సన్ కటకం దీపిక మంగళవారం ప్రారంభించారు. సంక్రాంతి పండుగ పర్వదినాల్లో భాగమైన ఏటి పండుగ కనుమ రోజు ప్రారంభమై మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారు. తొలిరోజు బుల్లి తెర సినినటి ఐశ్వర్య, సినీ గాయకులచే గానలహరి జరిగింది.

శ్రీవారి ఆలయంలో తిరిగి మొదలైన సుప్రభాతం

తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుప్రభాత సేవ తిరిగి మొదలైంది. పవిత్రమైన ధనుర్మాసం ఆదివారంతో ముగియడంతో సోమవారం వేకువజాము నుంచి శ్రీవారి ఆలయంలో సుప్రభాతసేవ పునఃప్రారంభమయ్యింది. గతేడాది డిసెంబరు 17వ తేదీ తెల్లవారుజాము నుంచి ధనుర్మాస ఘడియలు ప్రారంభమైన నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో సుప్రభాతసేవ స్థానంలో గోదా తిరుప్పావై పారాయణం కొనసాగింది. అయితే జనవరి 14వ తేదీతో ధనుర్మాస ఘడియలు పూర్తికావడంతో 15వ తేదీ నుంచి యథాప్రకారం ఆలయంలో సుప్రభాత సేవ నిర్వహించారు.

టీటీడీకి ఆర్గానిక్ నెయ్యి విరాళం

తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి రూ.22 లక్షల విలువైన ఆర్గానిక్ నెయ్యి సోమవారం విరాళంగా అందింది. పూణేకి చెందిన పరాగ్ ఫుడ్స్ సంస్థ ఆధ్వర్యంలోని భాగ్యలక్ష్మి డెయిరీ వెయ్యి కేజీల ఆర్గానిక్ నెయ్యిని అందించింది. సంస్థ ఛైర్మన్ దేవేందర్ షా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అక్షా లీషా తరుపున పలమనేరులోని భాగ్యలక్ష్మి డెయిరీ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ నక్రా బృందం ఈ విరాళాన్ని శ్రీవారి ఆలయ డిప్యూటీఈవో లోకనాథం, పడిపోటు సూపరిటెండెంట్ కృష్ణమూర్తికి అందజేసింది.

నేదురుమల్లితో అసమ్మతి నేతల సమావేశం

నాయుడుపేట, జనవరి 16: నాయుడుపేట మండలం మేనకూరులో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి జిల్లా అధికారి ప్రతినిధి కట్టా సుధాకర్ రెడ్డి నివాసానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి మంగళవారం వెళ్లారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీయవ్య వ్యతిరేకిస్తున్న నాయకులు రాంకుమార్‌రెడ్డితో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు, పార్టీలో అసమ్మతి తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. కార్యక్రమంలో రైతు విభాగ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ, సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, రాకేష్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడి తెప్పోత్సవం

వెంకటగిరి టౌన్, జనవరి 16: పట్టణంలోని కుమ్మరిగుంటలో సాయినాథుడికి మంగళవారం కనుమ పండుగ సందర్భంగా తెప్పోత్సవం నిర్వహించారు. సాయిబాబా ప్రత్యేక అలంకరణలో భక్తులు దర్శనమిచ్చారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

నాయుడుపేట, జనవరి 16: నాయుడుపేట మండలం మేనకూరు సమీపంలోని మామిడికాలువ వద్ద కోడి పందేల స్థావరంపై ఎస్ఈబీ సీఐ ఆర్‌యుబీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. కోడి పందేలు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు, మునిరాజా, వీరాస్వామి, రమణయ్యను అరెస్టు చేశారు. వారి వద్దనుంచి రూ.5 వేల నగదు, 3 సెల్‌ఫోన్లు, మూడు పందెం కోళ్లు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఈబీ సీఐ తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

సూళ్లూరుపేట, జనవరి 16: మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు వద్ద 84 బాటిళ్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఆదివారం రాత్రి పోలీసులు మన్నారు పోలూరులో గస్తీలో ఉన్న సమయంలో సబ్‌స్టేషన్ సమీపంలో కొందరు వ్యక్తులు పోలీసులను చూసి పరారయ్యారు. పోలీసులు అక్కడికెళ్లి పరిశీలిచంగా గోనె సంచిలో ఉన్న 84 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే

ఏపీకి విభజన హామీలు అమలు

తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్



తిరుమల ఆలయం వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్

తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర విభజన అనేది అనివార్యం. ఆనాడే ఏపీకి అవసరమైన ప్రత్యేక హోదా, ఇతర అభివృద్ధి అంశాలతో హామీలు ఇచ్చాం. ఆ దిశగానే అప్పటి ప్రధాని కూడా హామీ ఇచ్చారు. కానీ ఆనాడు ఉన్నవాళ్లు ఒప్పుకోలేదు. కేంద్రంలో, ఏపీలో మా పార్టీ అధికారంలోకి వస్తే ఏపీకి రావాల్సిన విభజన హామీలు అమలు చేస్తాం' అని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణాతో పాటు ఏపీ కూడా బాగుండాలనే విధంగా పనిచేస్తామన్నారు. కాంగ్రెస్‌పై ప్రజలకు ఉన్న వ్యతిరేక భావన తొలగిపోయిందన్నారు. విభజనతో పాటు అభివృద్ధి కూడా జరగాల్సి ఉన్నప్పటికీ జరగలేదన్నారు. ఇక, ఏపీలో ఎన్నికల అంశంపై మాట్లాడుతూ.. తాను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తనని, పార్టీ నిర్ణయం మేరకు ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ప్రచారం కోసం తిరిగానన్నారు. తప్పకుండా ఏపీలో కూడా కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వమని ప్రజలను కోరుకుంటామన్నారు.కాంగ్రెస్‌కు కొత్త ఓట్లు వస్తాయా, లేక వైసీపీ, టీడీపీ ఓట్లు వస్తాయా అనేది భవిష్యత్తు నిర్ణయిస్తుందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

వైభవంగా మకరజ్యోతి పూజలు



మకరజ్యోతిని దర్శించుకుంటున్న భక్తులు

పుత్తూరు, జనవరి 16: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం మకరజ్యోతి పూజలు వైభవంగా జరిగాయి. అయ్యప్పస్వామికి అభిషేకాలను నిర్వహించి విశేష అలంకరణ చేశారు. ఆలయం ముందు కర్పూరంతో స్వామి పేర్లను తీర్చిదిద్దారు. శబరిమలైలో స్వామి మకరజ్యోతి దర్శనం తర్వాత ఇక్కడి ఆలయంలో హారతి పళ్లెంలో జ్యోతిని గురుస్వామి తీసుకుని ఆలయం ప్రదక్షిణ చేసి కర్పూరాన్ని వెలిగించారు. దేదీప్యమానంగా కర్పూర జ్యోతి మంటలు వెలగడంతో తన్మయత్వంతో భక్తులు అయ్యప్ప నామస్మరణ చేశారు. స్థానిక ఆర్టీసీ కార్మికుల ఉభయంతో జరిగిన ఈ కార్యక్రమంలో గురుస్వామి నరసింహరాజు, మున్సిపల్ ఛైర్మన్ హరి, సదాశివేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ రమేష్‌బాబు, మునస్వామినాయుడు, మేఘనాథం తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీపీ క్యాలెండర్ల ఆవిష్కరణ



పుత్తూరు అర్బన్, జనవరి 16: ఐటీడీపీ ఆధ్వర్యంలో నగరి నియోజకవర్గ క్యాలెండర్లను మంగళవారం మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు రాచపాళెంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాలి గోపీనాథ్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం కల్పించాల్సిన బాధ్యత ఐటీడీపీ శ్రేణులపై ఉందని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా అత్యంత కీలకమైనవని, వైసీపీ అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ఐటీడీపీ కార్యకర్తలు క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. నగరి నుంచి గాలి భానుప్రకాష్‌ను గెలిపించుకోవడం ద్వారా ముద్దుకృష్ణమ ఆశయాలను ముందుకు తీసుకెళ్లినట్లు అవుతుందని స్పష్టం చేశారు. అభివృద్ధి చెందిన నగరి కావాలంటే గాలి భానుప్రకాష్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువతు రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ డీజీ ధనపాల్, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు సంతోష్‌రాజు, పట్టణ కోఆర్డినేటర్ ఈశ్వరయాదవ్, ఐటీడీపీ సభ్యులు ధనంజయులు, వెంకటేష్, లీలాప్రసాద్, బాలాజీ, దినేష్, బుజ్జిబాబు, జగత్, సాయి, చంద్రశేఖర్‌రెడ్డి, హరి, మాతయ్య, సుధాకర్, శివరాజు, మురళి, వినయ్, లోకేష్ పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

పుత్తూరు అర్బన్, జనవరి 16: అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన పుత్తూరులో జరిగింది. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు... మున్సిపల్ పరిధిలోని నందిమంగళం దళితవాడకు చెందిన రామ్మూర్తి(65) పట్టణంలోని గోవిందపాళెం వద్ద ఉన్న సామిల్లులో నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి సామిల్లులో విధుల్లో ఉన్న రామ్మూర్తి మంగళవారం ఉదయం విగతజీవుడై కనిపించాడు. తలపై గాయం ఉండడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కనుల పండువగా గోదాదేవి కల్యాణం



ఊరేగుతున్న గోదాదేవి సమేత కల్యాణ వెంకన్న

నారాయణవనం, జనవరి 16: మండలంలోని నెలకొనిన్న పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం గోదాదేవి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, నిత్యపూజా కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం గోదాదేవిని తిరుచ్చి వాహనంపై ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం నుంచి విచ్చేసిన కల్యాణ వెంకన్నకు, ఆండాల్ అమ్మవారితో ఆలయ అర్చకులు పుష్పమాలలను మార్చి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పశువుల పండుగ

పుత్తూరు టౌన్, జనవరి 16: పుత్తూరు మండలంలో మంగళవారం కనుమ పండుగను వైభవంగా నిర్వహించారు. పశువులను పసుపు, కుంకుమ పెట్టి, వాటి నుదుట తిలకాలు దిద్ది పూలతో అలంకరించారు.

రానున్నది టీడీపీ ప్రభుత్వమే: భానుప్రకాష్



టీడీపీ నాయకులతో గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి 16: రాష్ట్రంలో రానున్నది, నగరి గడ్డపై ఎగరనున్నది టీడీపీ జెండానే అని ఆ పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. మంగళవారం మున్సిపాలిటీకి చెందిన 7వ వార్డు, 10వ వార్డు నాయకులు, కార్యకర్తలు భానుప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అబద్ధపు హామీలతో ఒకసారి ప్రజలను మోసగించారని, రెండవసారి మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరని ఆయన తేల్చిచెప్పారు. ప్రతి టీడీపీ కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావాలని సూచించారు. వైసీపీ ఇచ్చిన అబద్ధపు హామీలు, ప్రజాసమస్యలపై ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై జరిగే పోరాటంలో వారికి అండగా ఉండాలని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి కార్యకర్తకు న్యాయం చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, మోసపోయిన నగరి ప్రజల కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పోరాడాలన్నారు. అనంతరం గాలి భానుప్రకాష్‌ను దుశ్శాలువ, పూలదండతో నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో 7,10వ వార్డుల ఇన్‌చార్జులు ఎన్ఎన్ ధనపాల్, డీజీ ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతుగా సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న అంగన్వాడీలు

పుత్తూరు అర్బన్, జనవరి 16: అంగన్వాడీ కార్యకర్తలు 36 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోవడంతో మద్దతుగా ప్రజల నుంచి సంతకాల సేకరణ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. మంగళవారం పట్టణంలో అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా మనసు మార్చుకుని అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని చెప్పారు. వేతనాల పెంపు డిమాండ్ పట్ల ప్రభుత్వం మొండివైఖరి అవలంభిస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వం బేషరతుగా వేతనాల పెంపుపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే దీక్షను కొనసాగించారు.

శారీరక ధృడత్వానికి క్రీడలు అవసరం

పుత్తూరు అర్బన్, జనవరి 16: శారీక, మానసిక ధృడత్వానికి క్రీడలు అవసరమని తడుకు సర్పంచు బొబ్బిలియాదవ్ అన్నారు. మంగళవారం పంచాయతీలో పరిధిలోని వేణుగోపాలపురంలో పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడల పట్ల యువత ఆసక్తి పెంచుకోవాలన్నారు. వీలైనంత వరకు ఏదో ఒక క్రీడలో పట్టుసాధించేందుకు యువత ప్రాధాన్యమివ్వాలన్నారు. అనంతరం ప్రధమ స్థానంలో నిలిచిన శీను టీంకు ప్రథమ బహుమతిగా రూ.3 వేలు, రన్నర్‌గా నిలిచిన హరి టీమ్‌కు రూ.2 వేలు బహుమతిగా అందించారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న సర్పంచ్ బొబ్బిలియాదవ్

క్రికెట్ టోర్నీ విజేత దినేష్ జట్టు



వడమాలపేట, జనవరి 16: సంక్రాంతి సందర్భంగా మండలంలోని ఎస్‌బీఆర్ పురంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో దినేష్ జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టుకు వైసీపీ నాయకుడు చైతన్య రూ.పదివేల నగదు బహుమతి అందజేశారు. ద్వితీయ బహుమతిగా జగన్ జట్టుకు రూ.మూడు వేల నగదు, మెడల్స్‌ను వెంకట్రామరాజు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బాబు, నాయకులు వెంకటరెడ్డి, మణి పాల్గొన్నారు.

విజేతకు బహుమతి అందజేస్తున్న నాయకులు

ఇందుశేఖర్‌కు చంద్రబాబు ఆహ్వానం



చంద్రగిరి, జనవరి 16:టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు తిరుపతి విమానాశ్రయంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు కొల్లూరు ఇందుశేఖర్ సాదర వీడ్కోలు పలికారు. సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు కుటుంబసభ్యులతో కలిసి స్వగ్రామమైన నారావారిపల్లెకు వచ్చిన చంద్రబాబు మంగళవారం సాయంత్రం తిరుగుపయనమయ్యారు. ఈ సందర్భంగా తనను ఒకసారి విజయవాడకు వచ్చి కలవా ల్సిందిగా చంద్రబాబు చెప్పారని ఇందుశేఖర్ తెలిపారు.

చంద్రబాబుకు సాదర వీడ్కోలు



చంద్రబాబుతో టీడీపీ నాయకులు

రేణిగుంట,జనవరి16:టీడీపీ అధినేత చంద్రబాబుకు సోమవారం తిరుపతి విమానాశ్రయంలో టీడీపీ నాయకులు సాదర వీడ్కోలు పలికారు.సాయంత్రం 5.15 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు అమరనాథరెడ్డి, నరసింహయాదవ్, ఎం.సుగుణమ్మ,గాలి భానుప్రకాష్, పులుగోరు మురళి, యశ్వంత్‌రెడ్డి, కృష్ణ యాదవ్,మునస్వామినాయుడు, చిన్నారెడ్డి, ఉదయ్ కుమార్‌రెడ్డి,రవి,గురవారెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.

18న ఖ్వాజా గరీబ్ నవాజ్ ప్రత్యేక ప్రార్థనలు

రేణిగుంట,జనవరి16: రేణిగుంట బుగ్గవీధిలోని కరుమారియమ్మ ఆలయానికి ఎదుటవున్న ఖానఖా-ఏ-గరీబ్ నవాజ్‌లో గురువారం రాత్రి 7 గంటలకు హజరత్ ఖ్వాజా గరీబ్‌నవాజ్ ప్రత్యేక ప్రార్థనలు,పేదలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆశ్రమ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.రాజస్థాన్‌లోని అజ్మీర్‌లోవున్న హజరత్ ఖ్వాజాగరీబ్ నవాజ్ 812వ వార్షిక ఉరుసు ఉత్సవాన్ని పురస్కరించుకుని రేణిగుంటలో ఉన్న ఈ ఆశ్రమంలో ప్రత్యేక ప్రార్థనలుంటాయన్నారు.

రైలు పట్టాలపై మృతదేహం స్వాధీనం



రేణిగుంట, జనవరి16: రేణిగుంట-కడప రైలు మార్గంలోని కరకంబాడి సమీపంలో సోమవారం ఒడిశాకు చెందిన రాజ్‌బిర్ కుమార్(37) రైలు కింద పడి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ రవి తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించామన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం పంపామని చెప్పారు.

ముక్కంటి అన్నదానానికి విరాళాలు

శ్రీకాళహస్తి, జనవరి 16: ముక్కంటి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు విరాళాలు సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన నీరజ రూ.లక్ష , కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన వెంకటరెడ్డి రూ.లక్ష , గుంటూరుకు చెందిన గాలి శ్రీనివాసరావు రూ.50 వేలు విరాళంగా సమర్పించారు. ఆలయ అధికారులు దాతలకు విరాళ పత్రం అందజేసి ధన్యవాదాలు తెలిపారు.

చంద్రబాబు కోసం పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 16: చంద్రబాబుపై అక్రమ కేసులను కొట్టివేయాలని ప్రార్థిస్తూ శ్రీకాళహస్తి పట్టణం తేరు వీధిలో వెలసిన సుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గురవారెడ్డి,రవి, ముని రెడ్డి, దొరై రాజ్ రెడ్డి, రాఘవులు యాదవ్, ఎమ్మెస్ రెడ్డి, సాయి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 16: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని అయ్యప్ప ఉత్సవ మూర్తిని ఆలయంలోని 16 కాళ్ల మండపంలో కొలువుదీర్చారు. విశేష పూజా ద్రవ్యాలతో వేదోక్తంగా అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం ధూప, దీప, నైవేద్యాలతో హారతులు సమర్పించారు.

టీడీపీతోనే భవితవ్యం



సత్రవాడ ప్రవీణ్‌తో యువకులు

శ్రీకాళహస్తి, జనవరి 16: టీడీపీతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు సాధ్యమని పార్టీ యువ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య తనయుడు ప్రవీణ్ అన్నారు. పట్టణంలోని ఆయన నివాసం వద్ద సంక్రాంతి సందర్భంగా యువ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధి రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ... యువతలో రాష్ట్ర భవిష్యత్తుపై ఆందోళన వుందన్నారు. తిరిగి చంద్రబాబు పాలనతోనే రాష్ట్రానికి పూర్వవైభం సాధ్యమని అభిప్రాయం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ఏర్పేడు, జనవరి 16: ఏర్పేడు మండలం బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు నిర్మల్‌కుమార్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులు ట్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ సైనికుడు గురవయ్య మృతి



ఏర్పేడు, జనవరి 16: ఏర్పేడులోని అశోక్ నగర్‌కు చెందిన మాజీ సైనికుడు గాలి గురవయ్య(74) అనారోగ్యంతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. సోమవారం మధ్యాహ్నం 2గంటలకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో పలువురు సీఐఎస్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు. ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.

అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నియంత్రణ

శ్రీకాళహస్తి, జనవరి 16: అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాలను నియంత్రించగలమని శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజవర్ధన్ అన్నారు. పట్టణంలోని డిపోలో మంగళవారం రహదారి భద్రతా మాసోత్సవాలను ప్రారంభించారు.ట్రాఫిక్ ఇంచార్జి ఏఎస్ఐ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గొబ్బెమ్మ ఉత్సవం

శ్రీకాళహస్తి జనవరి 16: గొబ్బెమ్మ ఉత్సవం సోమవారం వైభవంగా జరిగింది. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని గొబ్బెమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని అలంకార మండపంలో ఉత్సవమూర్తిని స్వర్ణాభరణాలు, వజ్ర వైడూర్యాలు, సుగంధ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అనంతరం ధూప,దీప, నైవేద్యాలు సమర్పించారు. సింహ వాహనంపై పురవీధుల్లో గొబ్బెమ్మను ఊరేగించారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సేవతోనే సంతృప్తి

శ్రీకాళహస్తి జనవరి 16: సేవతోనే సంతృప్తి లభిస్తుందని జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొట్టెసాయి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణ శివారు లంకమిట్ట ఎస్టీ కాలనీలో సోమవారం సంక్రాంతిని పురస్కరించుకుని పేద పిల్లలకు కొత్త దుస్తులు వితరణ చేశారు. జనసేన నాయకులు కుమార్ ,మహేష్, వేణుగోపాల్,ఢిల్లీ బాబు, చిరంజీవి, రాఘవ, నారాయణ, ప్రసాద్, చైతన్య పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల అందజేత

ఏర్పేడు, జనవరి 16: ఏర్పేడు మండలం వికృతమాల గ్రామంలో మంగళవారం అయోధ్య రామమందిర అక్షింతలను ప్రజలకు అందజేశారు. శ్రీరామచంద్రుడి చిత్రపటాలు, కరపత్రాలు, ఆహ్వాన పత్రికలను కూడా అందజేశారు.అయోధ్య రామమందిరానికి రూ.40వేలు విరాళాలు వచ్చాయి. గిరి, సహదేవరెడ్డి, గుళ్లూరు మేఘ వర్ధం, గూళూరు ప్రకాష్‌రావు, గూళూరు వెంకటేష్, దామోదర్, గిరిబాబు, కాకి వినోద్, వెంకటాద్రి, మనోహర్ పాల్గొన్నారు.

నలుగురు కోడిపందెం రాయుళ్లు అరెస్టు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 16: మండలంలోని కంచనపుత్తూరు వద్ద కోడిపందెం ఆడుతున్న నలుగురిని సోమవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. రెండు కోళ్లు, రూ. 3200 నగదును స్వాధీనం చేసుకున్నారు.

వైభవంగా సూర్యనారాయణ హోమం

వరదయ్యపాళెం, జనవరి 16: వరదయ్యపాళెం మండలం గోవర్ధనపురంలో సోమవారం సూర్యనారాయణస్వామి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. అయోధ్య శ్రీరామ అక్షింతలను పంపిణీ చేశారు.

రాబోయేది టీడీపీ ప్రభుత్వమే

కేవీబీపురం, జనవరి16: వచ్చే ఎన్నికల్లో రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజుల నాయుడు చెప్పారు. మంగళవారం ఆయన వడ్డికండ్రిగ గ్రామానికి చెందిన యువతతో సమావేశమయ్యారు.

మాకు ఇంటి స్థలాలు ఇప్పించండి

కేవీబీపురం, జనవరి16: మండలంలోని కాట్రపల్లి రెవిన్యూ పరిధిలో సర్వే నెంబరు 61/4లో 1.74ఎకరాలు సర్వే నెంబరు 60/2లో 1.96ఎకరాలు ఖాళీగా ఉండడంతో ఇంటి స్థలాలు లేని కాట్రపల్లి దళితులు మంగళవారం చిన్నపాటి గుడిసెలు వేశారు.రెవిన్యూ సిబ్బంది అక్కడకు చేరుకుని గుడిసెలు ఖాళీ చేయాలని చెప్పగా గ్రామస్తులు అంగీకరించలేదు.తమకు కొంత సమయం కేటాయిస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని రెవిన్యూ సిబ్బంది హామీ ఇచ్చారు.







అంజూరు వారి మండపం వద్ద రంగవల్లులు, ఎదురుసేవ మండపం వద్ద కోలాట నృత్యాలు, అశ్వ,సింహ వాహనాలపై ఊరేగుతున్న స్వామి అమ్మవారు

శాస్త్రోక్తంగా త్రిశూల గిరి ప్రదక్షిణ

శ్రీకాళహస్తి, జనవరి 16: త్రిశూల, పల్లకి గిరి ప్రదక్షిణ సోమవారం వేడుకగా జరిగింది. జ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి కైలాసగిరి ప్రదక్షిణకు ముందు రోజు త్రిశూలం గిరి ప్రదక్షిణ చేయడం సాంప్రదాయం. సోమవారం సంక్రాంతి పర్వదినం రోజున పల్లకి, త్రిశూలం, కైలాసగిరుల్లో ఊరేగించి తిరిగి ఆలయంలో కొలువుదీరాయి. ఆలయ అర్చకులు విశేష పూజలతో ఉత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. మంగళవారం స్వామి అమ్మవార్లు గిరిప్రదక్షిణగా వెళ్లి దేవగణాలకు ఆహ్వానం అందజేశారు.

స్మశాన దారిపై వివాదం...శవంతో నిరసన



సత్యవేడు, జనవరి 16: మండలంలోని మాదనపాళెంలో మంగళవారం స్మశాన దారి విషయమై వివాదం నెలకొంది.అరుంధతివాడకు చెందిన సుందరయ్య సోమవారం మృతి చెందారు.అంత్యక్రియల కోసం మంగళవారం మృతదేహాన్ని స్మశానవాటికకు తరలించబోయారు.ఆ దారిని ఆక్రమించుకున్న వ్యక్తి తన పొలంమీదుగా మృతదేహాన్ని తరలించేందుకు అంగీకరించలేదు.దారికి అడ్డుగా వేసిన కంచె తొలగించేందుకు ఒప్పుకోకపోవడంతో వివాదం చోటు చేసుకుంది. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి నిరసన తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామ పెద్దల జోక్యంతో తాత్కాలికంగా వివాదం సద్దుమణిగింది. రెవిన్యూ అధికారులు స్పందించి ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

108 అంబులెన్స్‌లో పాప జననం



కేవీబీపురం, జనవరి 16 : మండలంలోని ఆదవరం గిరిజన కాలనీకి చెందిన సునీత 108 అంబులెన్స్‌లో ఓ పాపకు జన్మనిచ్చింది. సోమవారం పురిటినొప్పులు రాగా ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు 108కు సమాచారం ఇచ్చారు. గ్రామానికెళ్ళిన అంబులెన్స్ ఆమెను తీసుకుని శ్రీకాళహస్తి బయలుదేరింది.మధ్యలో సునీతకు నొప్పులు ఎక్కువ కావడంతో 108సిబ్బంది నాగయ్య, నాగరాజు సహకారంతో ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది.

చంద్రబాబును కలసిన టీడీపీ నాయకులు



పిచ్చాటూరు, జనవరి 16: నారావారిపల్లెలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును సోమవారం సత్యవేడు నియోజకవర్గ టీడీపీ నాయకులు జేడీ రాజశేఖర్, తిరుపతి పార్లమెంట్ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.రవి మర్యాద పూర్వకంగా కలసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడు సర్పంచ్ ఉప ఎన్నికల్లో సత్తాచాటిన రవిని, నాగలాపురం నుంచి టీపీ కోట వరకు 18 కి.మీ రహదారికి సొంత ఖర్చులతో మరమ్మతులు చేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించిన జేడీఆర్‌ను చంద్రబాబు అభినందించారు.



ఘనంగా అంకాళమ్మ ఉత్సవాలు





విశేషాలంకరణలో అంకాళమ్మ
పుష్పపల్లకిలో ఊరేగింపు

బుచ్చినాయుడు కండ్రిగ, జనవరి 16: మండలంలోని ఆలత్తూరులో అంకాళమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సంక్రాంతికి ముందురోజు నుంచి గ్రామంలో ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. కనుమ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పుష్పపల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. నిర్వాహకులు చంద్రారెడ్డి, మోహనరామిరెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి.

ఘనంగా ధర్మరాజుల తిరునాళ్ల



పురవీధుల్లో ఊరేగుతున్న పాండవులు

వరదయ్యపాళెం, జనవరి 16: వరదయ్యపాళెం మండలం సీఎల్ఎన్‌పల్లిలో మంగళవారం కనుమ పండుగను పురస్కరించుకుని ధర్మరాజుల తిరుణాళ్లను నిర్వహించారు. ముందుగా గంగమ్మ, పోతురాజును ఊరేగించగా అనంతరం ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు ఉత్సవ మూర్తులను ఊరేగించారు. సర్పంచు దుద్దు వేణు, ఎంపీటీసీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'శుద్ధ పాఠశాల-సుందర పాఠశాల'లో వేద విద్యార్థులు

తిరుమల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): టీటీడీ విద్యాసంస్థల్లో 'శుద్ధ పాఠశాల-సుందర పాఠశాల' కార్యక్రమానికి టీటీడీ శ్రీకారం చుట్టింది. గతంలో 'శుద్ధ తిరుమల-సుందర తిరుమల' పేరిట తిరుమల, ఘాట్ రోడ్లు, కాలినడక మార్గాల్లో శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రతినెలా మొదటి శనివారం ఈకార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకుంది. ఇందులో భాగంగా సోమవారం వేదపాఠశాలలో విద్యార్థులు తమ పాఠశాల, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు.

తమిళ మందుబాబుల సందడి



బలిజకండ్రిగలోని ప్రభుత్వ మద్యం షాపువద్ద రద్దీ

కనుమ సందర్భంగా తమిళనాడులో మద్యం షాపులు మూసేయడంతో సరిహద్దుల్లోని పాలసముద్రం మండలం బలిజకండ్రిగ మద్యం షాపు మంగళవారం కిటకిటలాడింది. ఉదయం నుంచే రద్దీ పెరగడంతో మద్యం దుకాణాల ఎదుట పోలీసులు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. రోజుకు లక్షా లక్షన్నర రూపాయల అమ్మకాలు జరిగే ఈ షాపులు అయిదారు లక్షల మద్యం హాట్‌కేకుల్లా అమ్ముడైపోయింది. నిజానికి తమిళనాడు కంటే ఇక్కడ మద్యం ధరలు ఎక్కువ. అయినా తమిళనాడు మందుబాబులు ఎగబడ్డారు.

\- పాలసముద్రం

దొరికిన కోడి.. దొరికినట్లు..!

నెల్లూరు జిల్లాలో మినీ లారీ బోల్తా
నలుగురికి గాయాలు

కోళ్ల లారీ బోల్తాపడి, గాయపడి కొందరు బాధపడితే.. జనమేమో రోడ్డుపై పడిన కోళ్ల కోసం పరుగు తీశారు. దొరికింది దొరికినట్లు పట్టుకెళ్లి 'పండుగ' చేసుకున్నారు. ఈ ఘటన నెల్లూరు జిల్లా మనుబోలులో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా పుంగనూరు నుంచి 1080 కోళ్లతో మినీలారీ నెల్లూరుకు బయలుదేరింది. మంగళవారం తెల్లవారుజామున మనుబోలు వంతెన వద్ద ఈ కోళ్లలారీని మరో లారీ అధిగమించి ముందుకు వచ్చి హఠాత్తుగా బ్రేక్ వేసింది. దీంతో కోళ్ల లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుజిత్, క్లీనర్ సందీప్‌తో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కోళ్ల లారీ బోల్తా పడిందన్న విషయం తెలియగానే స్థానికులంతా హైవే పైకి చేరుకున్నారు. సందట్లో సడేమియా అంటూ చేతికి చిక్కినన్ని కోళ్లను పట్టుకెళ్లారు. కాగా, మిగిలిన కోళ్లను మరోలారీలో ఎక్కించి నెల్లూరుకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

\- మనుబోలు



లారీ నుంచి కోళ్లు పట్టుకెళుతున్న స్థానికులు

వెనక్కి తగ్గేదే లేదు

శ్రీకాళహస్తి జనవరి 16: తమ డిమాండ్లు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె నుంచి వెనక్కి తగ్గేదే లేదని అంగన్వాడీలు అన్నారు. శ్రీకాళహస్తి ఐసీడీఎస్ కేంద్రం వద్ద మంగళవారం రిలే నిరాహార దీక్షతో సమ్మెను కొనసాగించారు.శ్రమకు తగ్గ జీతాలు పెంచమని అడిగితే ఎస్మా చట్టం ప్రయోగించడం ప్రభుత్వ దుర్మార్గ వైఖరికి నిదర్శనమన్నారు.

పిచ్చాటూరు: సంక్రాంతి,కనుమ రోజుల్లోనూ అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. సోమవారం మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తపరిచారు. కనుమ పొంగళ్లను అక్కడే తయారుచేసి నైవేద్యాన్ని తీసుకున్నారు. సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలుపుతూ ధర్నాలో పాల్గొన్నారు.

సత్యవేడు: అంగన్వాడీ కార్యకర్తలు సంక్రాంతి సందర్భంగా సమ్మె శిబిరం వద్దే ఆటపాటలతో నిరసన తెలిపారు. గొబ్బిళ్ళు తడుతూ, పాటలు పాడుతూ ఆందోళన చేపట్టారు.సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ అంగన్వాడీలకు పండుగలు సైతం నిర్వహించుకోనీయకుండా రోడ్డుపాల్జేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాల్లో మార్పు రాకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అంగన్వాడీ కార్యకర్తలు నిర్మల, శాంతి, ఝాన్సీ, భారతి, భువన, అనురాధ, డీవైఎఫ్ఐ నాయకుడు మురళి తదితరులు పాల్గొన్నారు.







శ్రీకాళహస్తిలో రిలే దీక్ష చేస్తున్న అంగన్వాడీలు, పిచ్చాటూరులో మోకాళ్లపై నిల్చుని నిరసన, సత్యవేడులో ఆందోళన